మరింత చేరువగా రైతునేస్తం



వాంకిడి రైతు వేదికలో పంటల సాగుపై సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

- ప్రస్తుతం 15 రైతు వేదికల్లో ప్రసారం
- అదనంగా మండలానికి రెండు క్లస్టర్లలో ఏర్పాటు

వాంకిడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులకు మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తూ రైతులకు సాగులో అవసరమైన సలహాలు, సూచనలతో పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించేందుకు గానూ ప్రతీ మండలంలో కొత్తగా రెండు వ్యవసాయ క్లస్టర్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన క్లస్టర్లలో రైతు నేస్తం కార్యక్రమానికి సంబంధించిన వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన పనులు చేపడుతున్నారు.

రైతు నేస్తం ఉద్దేశం...

వ్యవసాయంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమం ప్రారంభించింది. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్‌ను అనుసంధానం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, అభ్యుదయ రైతుల ద్వారా తరగతులు నిర్వహించి పంటల సాగు, మెళకువలు, యాజమాన్య పద్ధతులను, చీడపీడల నివారణ చర్యలను రైతులకు వివరిస్తున్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నూతన వ్యవసాయ సమాచారాన్ని రైతులకు చేరవేస్తున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్ వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చేందుకు ఎంతగానో దోహదపడుతోంది. దీంతో రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మొదటి దశలో మండలానికి ఒక రైతు వేదికను ఎంపిక చేయగా అదనంగా మరో రెండు క్లస్టర్లకు విస్తరిస్తున్నారు. జిల్లాల్లో మొత్తం 70 క్లస్టర్లున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 15 రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తుండగా కొత్తగా మరో 30 వేదికల్లో నిర్వహించనున్నారు.

ప్రస్తుతం కొనసాగుతున్న రైతువేదికలు

జిల్లాలో ప్రస్తుతం 15 రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు. వాంకిడి, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కెరమెరి, తిర్యాని, లింగాపూర్, జైనూర్, సిర్పూర్ (యు) సిర్పూర్(టి) రెబ్బెన, పెంచికల్‌పేట్, దహెగాం, కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు కొనసాగుతున్నారు.



రైతునేస్తం కోసం ఎంపిక చేసిన బంబార రైతు వేదిక

రైతులకు మరింత ప్రయోజనం

మిలింద్ కుమార్ ఏడీఏ: ఆసిఫాబాద్



రైతునేస్తం అద్భుతమైన క్యాక్రమం. వ్యవసాయ శాస్త్రవేత్తలు అధికారులు సాగు పద్ధతులను తెలియచేయడంతో పాటు రైతులతో ముఖాముఖి చర్చించి వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. అభ్యుదయ రైతుల అనుభవాలు చూడడం ద్వారా రైతుల్లో సేద్యంపై నమ్మకం పెరుగుతుంది. నూతనంగా ఎంపిక చేసిన క్లస్టర్లలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం పనులు కొనసాగుతున్నాయి. త్వరలో రైతు నేస్తం సేవలు అందుబాటులోకి వస్తాయి. రాబోయే రోజుల్లో రైతులకు మరింత మేలు జరుగుతుంది. రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

అదనంగా ఎంపిక చేసిన గ్రామాలు

మండలం	ఎంపికైన గ్రామాలు
వాంకిడి	బంబార, ఇందాని
ఆసిఫాబాద్	చిర్రకుంట, రహపల్లి
పెంచికల్‌పేట్	కమ్మర్‌గాం, చేడ్వాయి
దహెగాం	కుంచవెల్లి, గిరివెల్లి
కౌటాల	మొగడ్‌ధగర్, సాండ్‌గావ్
బెజ్జూర్	కుకడ, ఔట్‌సారంగపల్లి
సిర్పూర్(టి)	చింతకుంట, వెంపల్లి
కాగజ్‌నగర్	జంబూగ, దుర్గానగర్
తిర్యాని	గిన్నెధరి, మాణిక్యపూర్
రెబ్బెన	తక్కలపల్లి, నారాయణపూర్
లింగాపూర్	కాంచన్‌పల్లి, లింగాపూర్
సిర్పూర్(యూ)	సిర్పూర్(యూ), పంగిడి
జైనూర్	లెండిజల, ఊశేగాం
కెరమెరి	సాంగ్వి, సుద్దాపూర్
చింతలమానెపల్లి	డబ్బా, రుద్రాపూర్

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని అక్రమ వెంచర్లు వేసుకుని ప్లాట్లుగా అమ్ముతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని భాగ్యనగర్, సందీప్‌నగర్, ఆర్‌ఆర్ కాలనీ, జన్కాపూర్ లలో విచ్చలవిడిగా డీటీసీపీ అనుమతులు లేకుండా అక్రమ వెంచర్లు వేసుకుని ప్లాట్లుగా అమ్ముతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వెంచర్లు వేసుకుని ప్లాట్లుగా అమ్ముతున్నారని, రాజకీయ అండదండలతో వెంచర్ల దందా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, దినకర్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కెరమెరి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరందోళి, కోటా, గోయగాం, భీమన్‌గొంది గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పరందోళి, కోట గ్రామాల్లో తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

దహెగాం: భూ భారతి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మునివార్ షరీఫ్ అన్నారు. సోమవారం దహెగాం మండలంలోని పంబాపూర్, గిరివెల్లి గ్రామాల్లో భూ భారతి సదస్సులను నిర్వహించారు. సమస్యలను రైతులు దరఖాస్తు రూపంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఐ నాగభూషం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బెజ్జూరు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్ యాదవ్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువుల పంపిణీలో చాలా అన్యాయం జరుగుతోందన్నారు వ్యవసాయాధికారులు రైతులకు ప్రభుత్వపరంగా వచ్చే ధరకే ఎరువులు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యల తీసుకుంటామని తెలిపారు.

- ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్‌వాడికి చెందిన సంగీత తనకు ఆశా కార్యకర్తగా ఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేశారు.
- రెబ్బెన మండలం గోలేటికి చెందిన కళావతి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేయాలని అర్జీ సమర్పించారు.
- ఆసిఫాబాద్ మండలం కొటగూడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ గత సంవత్సరం అగ్ని ప్రమాదంలో తన ఇల్లు దగ్ధమైందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని అర్జీ సమర్పించారు.
- దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన బాయక్క తాను సాగు చేసుకుంటున్న భూమికి పట్టా పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- బెజ్జూరు మండలం బారెగూడకు చెందిన భీంరావు తన తాత పేరిట గల భూమిని ఇతరులు అక్రమంగా పట్టా మార్చుకుంటున్నారని ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామానికి చెందిన జొన్నబీ తాను ఒంటరి మహిళ అని తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
- తిర్యాణి మండలం గంభీరావుపేటకు చెందిన లింగయ్య తన పేరిట గల భూమిని తనకు తెలియకుండా పట్టా చేసుకున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.
- రెబ్బెన మడలం కొండపల్లికి చెందిన సంతోష్‌బాబు తమ గ్రామంలో డీటీసీపీ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందజేశారు.
- ఆసిఫాబాద్ పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సత్యనారాయణ తమ తండ్రి పేరు మున్సిపల్ రికార్డుల్లో తప్పుగా నమోదు అయిందని, సవరించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

తొలకరి చినుకు కురిసింది

పెంచికలపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గత 15 రోజుల క్రితం అకాల వర్షాలు కురవడంతో వాతావరణం కొంత చల్లబడింది. అయితే మళ్లీ భానుడు ఉగ్రరూపం దాల్చడంతో అయిదు రోజులుగా ఎండలు, ఉక్కపోతతో మనుషులతో పాటు జీవాలు సైతం అల్లాడి పోయాయి. సోమవారం ఉదయం తొలకరి చినుకులు కురవడంతో వాతావరణం ఒక్క సారిగా చల్లబడింది.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకుడు

చింతలమానేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి తహసీల్దార్‌గా కె రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన మునావర్ షరీఫ్ దహెగాం మండలానికి బదిలీ కాగా మంచిర్యాల జిల్లా నుంచి రమేష్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, బాలాజీ, తిరుపతిగౌడ్, పోషన్న, భీమేష్, పురుషోత్తంచారి ఉన్నారు.

పోడు రైతులపై వేధింపులు ఆపాలి



పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో పోడు రైతులను అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని, వెంటనే ఆపాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లోని ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణకు సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిర్పూరు నియోజకవర్గంలో ప్లాంటేషన్ పేరిట అటవీ శాఖ అధికారులు పోడు రైతులను వేధిస్తున్నట్టు తెలిపారు. పోడు భూముల్లో మొక్కలు నాటుతామని పోడు పనులను అడ్డుకుంటున్నట్టు వివరించారు. అనంతరం పీసీసీఎఫ్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎల్ములే మల్లయ్య, అంకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుకారం, మానిక్‌రావు, రాష్ట్ర కౌన్సిలర్ సంజయ్‌కుమార్ మాట్లాడారు. నిజాం ప్రభుత్వంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి మక్దుం మోహినోద్దీన్ 1947లో ఎస్టీయూ సంఘం ఏర్పాటు చేశాడన్నారు. అప్పటి నుంచి నిరంతరం ఉపాధ్యాయ హక్కుల కోసం పోరాడుతుందన్నారు. అనంతరం కార్యవర్గసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగు, నగేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాడిన బిర్సా ముండా

సిర్పూర్(యు), జూన్ 9(ఆంధ్రజ్యోతి): బిర్సా ముండా ఆదివాసీల అస్తిత్వం కోసం పోరటం చేసిన సమరయోధుడు అని రాజ్ గోండ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు అనక దేవేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో భగవాన్ బిర్సా ముండా వర్ధంతిని రాజ్ గోండ్ ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయన ఉద్యమం ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం తొలిసారిగా గిరిజన భూమి హక్కులను చట్టబద్ధంగా గుర్తించిందన్నారు. కార్యక్రమంలో గోండ్వానా గోండ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావు, మాజీ సర్పంచ్ ఆర్క నాగోరావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, సంఘం మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు గేడం జగ్జీవన్,ఉర్వెత మోహన్,సంయుక్త కార్యదర్శి కోట్నాక పాండురంగ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి



ఇందానిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలు, బడి ఈడు పిల్లలు తప్పకుండా ప్రభుత్వ గిరిజన పాఠశాలలో చేర్పించా లని గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి చిరంజీవి అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఇందాని, తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడిమానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈవో శివచరణ్ సూచనలు ఇచ్చారు. సీఆర్పీ సందీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సిర్పూర్(యు): మండలంలోని మహగాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని తుమ్రిగూడ,మహగాం,కోడ్డిగూడ,లీగూడ,పాటేల్‌గూడపాములవాడ తదితర గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమాన్ని మహగాం స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఆత్రం రమా పరిశీలించారు. కార్యక్రమంలో మహగాం ఎస్‌సీఆర్పీ మండాడి గాగ్రు, ఉపాధ్యాయులు కోట్నాక పాండురంగ్, కోవ నారాయణ్,మంజుల, అరివింద్, జయశ్రీ, రాజేశ్వర్, క్రిష్ణకుమార్ పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని దహెగాం, గొర్రెగుట్ట, ఇట్యాల, పెసరికుంట గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురికి నీరు.. గ్రామస్థులు నిరసన



గోలేటిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు, నిలిచిన చెత్త

రెబ్బెన, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోలేటి గ్రామ పంచాయతీ ప్రధానరోడ్డుపై మురికినీరు ప్రవహిస్తుండటంతో గ్రామస్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. భగత్‌సింగ్‌నగర్‌లోని మురికి కాల్వల ద్వారా వచ్చే నీటిని సింగరేణి రహదారి పక్కనుంచి వెళ్తున్న మురికి కాల్వకు అనుసంధానం చేశారని గ్రామస్థులు తెలిపారు. దీంతో పెద్దఎత్తున నీరంతా మురికి కాల్వ ద్వారా ప్రవహిస్తూ గోలేటి విలేజికి వెళ్లే దారిలో అర్థాంతరంగా ఆగిపోయి రోడ్డుమీద, పంట భూములోకి చేరుతోదన్నారు. దీంతో రాకపోకలు సాగించటం ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. విషయం తెలుసుకున్న కార్యదర్శి రవీందర్ సంఘటన స్థలానికి చేరుకొని తాత్కాలికంగా మురికి కాల్వను మూసివేశారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. తక్షణమే తమకు శాశ్వత పరిష్కారం చూయించాల్సిందిగా కోరారు.

పోల్‌టాక్స్ విధానాన్ని రద్దు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పోల్‌టాక్స్ విధానాన్ని రద్దు చేయాలని కేబుల్ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రహెమాన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో ప్రణాళికను రూపొందించారు. ఇందులో భాగంగా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసి మంగళవారం జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా సాజీద్, ఆసిఫాబాద్ కేబుల్ ఆపరేటర్ కో కన్వీనర్‌గా అశోక్‌గౌడ్‌ను, అయిదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళా శక్తి'తో ఆర్థికాభివృద్ధికి కృషి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

ఆసిఫాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, విద్యా శాఖ కమిషనర్ యోగితారాణా, పంచాయతీరాజ్ కమిషనర్ లోకేష్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా చేపట్టే కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రెండు మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, మహిళా శక్తి భవనాల నిర్మాణాలకు స్థలాలను ఎంపిక చేసి పనులు ప్రారంభించి నవంబరు 30లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను కుట్టిస్తున్నామని తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం లోపే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు సరఫరా చేయాలని ఆదేశించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో పెట్రోల్ బంక్‌ల నిర్వహణకు స్థలాలు ఎంపిక చేసి ఆయిల్ కంపెనీలతో ఒప్పందం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించి, గర్భిణులు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 45,293 యూనిఫాంలకు గాను 36,000 యూనిఫాంలు సిద్ధం చేశామని, మిగితా యూనిఫాంలను మూడు రోజుల్లో పూర్తిచేసి పాఠశాలల పునఃప్రారంభం రోజు విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో మహిళా శక్తి భవనం కోసం స్థలాన్ని ఎంపిక చేసి పనులు ప్రారంభించామని వివరించారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్‌లు ఏర్పాటుకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో స్థలాన్ని ఎంపిక చేసి భారత్ పెట్రోలియం కంపెనీతో త్వరలో ఒప్పందం పూర్తి చేసుకుంటామని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, అదనపు అధికారి రామకృష్ణ, గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను ఈ నెల 25 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు సోమవారం హైదరాబాద్‌లోని చీఫ్ ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌లు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఓటరు జాబితా సవరణ, బూత్ స్థాయి అదికారుల నియామకం, గుర్తింపు కార్డుల జారీ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. 1200 ఓటరు దాటిన పోలింగ్ కేంద్రాల్లో సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం అవసరమైన భవనం, ప్రదేశం, బూత్ స్థాయి అధికారుల నియామక ప్రక్రియను ఈ నెల 25 లోగా పూర్తి చేయాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల్లో 1200 మంది ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలు 30 వరకు ఉన్నాయని రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. రెండు నియోజకవర్గాల్లో 678 మంది బూత్‌స్థాయి అధికారులు పనిచేస్తున్నారని 68 మంది బూత్‌స్థాయి అధికారుల సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారని మిగితా అధికారుల ఖాళీలను త్వరగా భర్తీ చేస్తామని, బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డు లు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టైగర్ జోన్‌ను రద్దు చేయాలి

వాంకిడి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ జోన్‌ను రద్దు చేయాలని టైగర్ రిజర్వు జోన్ పేరుతో తీసుకు వచ్చిన జీవో 49ని రద్దు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వాంకిడి మండలం ఇందాని గ్రామ పంచాయతీలోని మోఖాసిగూడ గ్రామంలో టైగర్ జోన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లజెండాలను ఎగురవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ టైగర్ కారిడార్ పేరిట జీవో నంబర్ 49ని వెంటరు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపడుతామని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలను ఇబ్బంది పెట్టే జీవోలను వెంటనే రద్దు చేయకుంటే ఊర్కొనే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు ఉన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గత ఫిబ్రవరిలో కేరళ రాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి సీనియర్ ఫెడరేషన్ అత్యాపత్య క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఆసిఫాబాద్‌లోని గిరిజన డిగ్రీ గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థిని గేడెం సుహాసిని బీజేపీ నాయకులు అరిగెల మల్లికార్జున్ యాదవ్ సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి బెంగాల్‌లో జరిగే ఆసియా కప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తేవాలన్నారు. నాయకులు పెంటన్న, దీపక్‌రావు, మహేష్ పాల్గొన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

కాగజ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ఎరువులు, సీడ్స్ దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐలు ప్రశాంత్‌రావు, వరణ్‌ప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిస్ట్రర్లను పరిశీలించారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి రామకృష్ణ, డీలర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నెన్నెల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్ నుంచి జోగాపూర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి డ్రైవర్ హరీష్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను నెన్నెల పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. డ్రైవర్‌తో పాటు ట్రాక్టర్ యజమాని ప్రశాంత్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీపై విచారణ చేపట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 52 పోస్టులు నియామకాల్లో మెరిట్ లిస్టుకు వ్యతిరేకంగా నియామక పత్రాలు అందజేశారని దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో బీఎస్పీ నాయకులు సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భుక్య రాజు, జిల్లా ఇన్‌చార్జి తుకారాం మాట్లాడుతూ పోస్టుల నియమకం విషయంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, డబ్బులు ఎవరు ఇచ్చారో వారికే నియామక పత్రాలు అందజేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వినోద్, శ్యాంరావు, కృష్ణజీ, పెంటయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల కొరత.. రైతన్న వెత



వాగు దాటుతున్న అనార్‌పల్లి గ్రామస్థులు(ఫైల్)

- పదిహేను రోజులుగా దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు
- ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయం
- పట్టించుకునే వారు కరువు

కెరమెరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు యూరియా, డీఏపీ వంటి రసాయన ఎరువుల కష్టాలు తప్పడం లేదు. పదిహేను రోజులు రైతులు ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గ్రోమోర్ కార్యాలయం చుట్టు తిరుగతున్నా పట్టించుకునే నాథుడే లేరు. ప్రైవేటు దుకాణాల్లో మాత్ర ఇష్టారాజ్యంగా అధిక ధరలకు అమ్ముతున్న చర్యలు తీసుకునే వారు కరువయ్యారు.

వంతెన లేక ఇబ్బందులు..

కెరమెరి మండలంలో సుమారు ఎనిమిది వేల మం ది రైతులు ఉండగా 29వేల విస్తీర్ణంలో భూమి సాగులో ఉంది. రైతులు అన్నిరకాల వ్యవసాయ పనులు పూర్తి చేశారు. ఇటీవల వర్షాలు కురవడంతో విత్తనాలు విత్త డానికి సిద్దంగా ఉన్నారు. కానీ మండలంలోని వాగు అవతల వైపు ఉన్న గ్రామాల ప్రజలు తమకు కావాల్సి ఎరువులు, విత్తనాలు వర్షాలు కురవకముందే నిలువ చేసుకుంటారు. కానీ వ్యాపారులు కొరతపేరుతో రైతులతో చెలగాట మాడుతున్నారు. అధికధరకు అమ్ముతున్నా అధికారులు పట్టి చుకవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు..

కెరమెరి మండలానికి 440మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశారని అధికారులు చెబుతున్నారు. రైతుల కోసం మండలంలో ఆగ్రోస్, డీజీఎంఎస్, హకా మూడు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. కానీ రైతులకు యూరియా కొరత ఉందని, కానీ రైతులకు యూరియా కొతర ఉందని తిరిగి పంపేస్తున్నారు. కొంత మధ్య వర్తుల ద్వారా అధికధరలకు అమ్మేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం ఉంది. ఎప్పుడు మూసే ఉంటుందని వాపోతున్నారు.

వర్షాలు ప్రారంభమైతే కష్టమే

- బాపురావు, రైతు, అనార్‌పల్లి



యూరియా, డీఏపీ ఎరువులకోసం వారం రోజులుగా తిరుగుతన్నా కొరత ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మా గ్రామానికి వెళ్లాలంటే అనార్‌పల్లి వాగు దాటాలి. వర్షాలు ప్రారంభమైతే వాహనాలు వెళ్లలేవు. అందుకే ముందే నిల్వ చేసుకుంటాం. ఎరువుల కొరత లేకుండా అధికారులు చూడాలి.

గాలిదుమారానికి కూలిన ఇల్లు



మంచిర్యాలలో కూలిన ఇల్లు

మంచిర్యాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల సబ్‌స్టేషన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి ఒక ఇల్లు కుప్పకూలింది. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి రూ.80వేల వరకు ఆస్థినష్టం జరిగినట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ రోడ్డుకు చెందిన మంద శ్రీనివాస్ ఇల్లు పైకప్పు పూర్తిగా కూలిపోవడంతో భారీ నష్టం వాటిల్లింది. ఇంటి పెంకులు శ్రీనివాస్ కూతురు సాత్వికపై పడటంతో ఆమె ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఈప్రమాదంలో ఇంట్లో ఉన్న వాషింగ్ మిషన్, కూలర్, ఒక సైకిల్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఘటన స్థలాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వప్న, జూనియర్ అసిస్టెంట్‌లు మల్లేష్, రవి సందర్శించి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం తనను తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాదితుడు కోరాడు.

ఎస్పీఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎస్పీఎం చీఫ్ మేనేజర్ రమేష్‌తో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):ఎస్పీఎం మిల్లులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ట్రేడ్ యూనియన్ నాయకుడు కొంగ సత్యనారాయణ, ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు కలిసి సోమవారం ఎస్పీఎం చీఫ్ మేనేజర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్పీఎంలో పనిచేస్తున్న 340 మంది శాశ్వత కార్మికులకు ఈఎస్‌ఐ కంట్రిబ్యూషన్ వెంటనే పునరద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రొటెక్షన్ యూనియన్(2381) ప్రధాన కార్యదర్శి వల్లాల సుభాష్, తెలంగాణ సిర్పూరు పేపర్ మిల్స్ యూనియన్(2735) కార్యనిర్వహక అధ్యక్షులు గోలెం వెంకటేష్, చీఫ్ వైస్ ప్రసిడెంట్ గోగర్ల రాములు, ఉపాధ్యక్షులు రాజేష్ యాదవ్, శ్యాంరావు, శ్రీనివాస్ ఉన్నారు.

కొయ్యలతో బారికేడ్ల ఏర్పాటు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కొయ్యలతో బారికేడ్లు ఏర్పాటు చేయిస్తున్న ఎంపీడీవో

కెరమెరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటారి గ్రామం వద్ద ఆసిఫాబాద్- ఆదిలాబాద్ రోడ్డు కల్వర్టు కోతకుగురై ప్రమాదకరంగా మారిందని 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో అంజద్‌పాషా స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది ద్వారా దగ్గరుండి సూచిక బోర్డులు(రెడ్ రెబ్బెన్‌తో కొయ్యలతో బారికేడ్లు) ఏర్పాటు చేయించారు. ఎంపీడీవో గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా సిబ్బందితో తాత్కాలికంగా ప్రమాద సూచిక బోర్డు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి సతీష్, సిబ్బంది ఉన్నారు.

అందరు చదవాలి.. అందరు ఎదగాలి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కెరమెరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అందరు చదవాలి- అందరు ఎదగాలని విద్యాశాఖ కమిషన్ సలహాదారు వెంకట్‌రెడ్డి అన్నారు. కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేష్ జిల్లావ్యాప్తంగా చేపట్టిన అక్షర చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమాన్ని కెరమెరి మండలం జోడేఘాట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యాశాఖ కమిషన్ సలహాదారు మాట్లాడుతూ వెనకబడ్డ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అందరు చదువుకోవాలన్న ఉద్దేశంతో ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేష్ జిల్లా వ్యాప్తంగా అక్షరచైతన్య యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యతోనే విముక్తి అని బలంగా నమ్మి ఆదివాసీ ప్రాంతంలో చేసిన విద్యాచైతన్య యాత్రకు అభినందనీయమన్నారు. 15 మండలాల్లో 15 గ్రామాల ప్రజలను చైతన్యం చేసి విద్యా ప్రాముఖ్యతను తెలియజేసి ప్రభుత్వ బడుల పటిష్ఠతకు పాటుపడాలని ఉపాధ్యాయుడు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీతారాం, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, గ్రామ పటేల్ రాజేశ్వర్, హెచ్‌ఎం మోతిరాం, నాయకులు శారద, రాజన్న, రమేష్, మణికేశ్వర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతిపై సంతాపం

సిర్పూర్(టి), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో సోమవారం ఉదయం విధి నిర్వహణ కోసం వెళ్తున్న క్రమంలో పంచాయతీ కార్యదర్శి బానోత్ సోనాలీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో సిర్పూర్(టి) ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి సోనాలీ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఎంపీడీవో సత్యనా రాయణకు వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో ఈవో తిరుపతి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు

- కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వివరాలు అడిగి తెలుసుకుంటున్న వినోద్ శేషన్

కాగజ్‌నగర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర పెట్రోలియం, సహజ వనరుల గ్యాస్ సంయుక్త కార్యదర్శి వినోద్ శేషన్ తెలిపారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని జగన్నాథ్ పూర్ ప్రాజెక్టు, దహెగాం, హత్ని గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణలోని అసంపూర్తి ప్రాజెక్టును పరిశీలించి ఆగిపోవటానికి గల కారణాలు, పూర్తి చేపట్టాల్సిన చర్యలను పరిశీలించి నివేదికలను అందజేస్తామన్నారు. ఈ నేపథ్యంలో కాల్వలను పరిశీలించామన్నారు. ఆయా గ్రామ శివారులోని నిర్మాణమైన ప్రాజెక్టు కాల్వలతో పాటు నిర్మాణం కానున్న కాల్వను పరిస్థితి పరిశీలించామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రెహమాన్, ఎస్ పిళ్లై, కేంద్ర భూగర్భ జల వనరుల ఈఈ వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ కుమారస్వామి, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఈ బాను మూర్తి, ఈఈ ప్రభాకర్ ఏఈలు క్రాంతి, సాయితేజ, తహసిల్దార్ మునావర్ షరీఫ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు సందర్శించేందుకు వచ్చిన కేంద్ర బృంద సభ్యులకు సోమవారం ప్రాజెక్టు వద్ద సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన్న రాజన్న, సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 2006 జూన్ 5న అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వేల ఎకరాల ఆయకట్టు సాగు లక్ష్యంతో రూ.118.90 కోట్లతో పనులు ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటికీ ఇంకా పూర్తి కాలేదని తెలిపారు. ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు లేకపోవటం, ప్రభుత్వాలు మారుతున్న పట్టింపే లేకుండా పోయిందని వివరించారు. ఈ ప్రాజెక్టు అడ్డంకులు పూర్తిగా తొలగించి వినియోగంలోకి వచ్చేట్టు చూడాలని కోరారు.



నూతన గనుల ఏర్పాటుపై దృష్టి

- మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రి టౌన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనుల ఏర్పాటు చేస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మంత్రిగా తనకు అవకాశం కల్పించినందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎఫ్‌సీఐని పునరుద్ధరించి ఐదు వేల ఉద్యోగాలు పునరుద్ధరించామన్నారు. సింగరేణిలో నూతన గనుల కోసం తనశామశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

కార్మికులకు నాణ్యమైన మందులు సరఫరా చేయాలి



ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్ జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఏరియా ఆసుపత్రుల్లో మందులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణాపూర్ డివైసీఎంవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ముష్కే సమ్మయ్య మాట్లాడుతూ కార్మికులు సంక్షేమంలో ప్రధానంగా వైద్యం ఒకటని దాని విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహించడం సరికాదని అన్నారు. ఏటా వందల కోట్లు వైద్యం కోసం ఖర్చవుతున్నాయని చెబుతున్న సంస్థ సీఎండీ బలరాం నాయక్ కార్మికుల వైద్యం కోసం మందులు కొనుగోలు చేయాల్సిన విషయంలో ఎందుకు ఆలోచిస్తున్నారన్నారు. కార్మికులకు ప్రధానంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలకు మందులు అందుబాటులో లేవని వెంటనే వాటి కొనుగోలు జరపాలన్నారు. అదేవిధంగా రిటైర్డు కార్మికులకు నెలకు సరిపడా ఇవ్వాల్సిన మందులు 10రోజులకు ఇస్తూ వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయల లింగయ్య, నాయకులు సుదర్శన్, బట్టు, సంపత్, అఫ్రోజ్ ఖాన్, శ్రీనివాస్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యం: జీఎం

మందమర్రి టౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): సంస్థలో ప్రమాదరహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమని, రక్షణే ప్రథమమని, రక్షణే ఎల్లప్పుడు అనే నినాదంతో ఉద్యోగులు విధులు నిర్వహించాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తెలిపారు. సోమవారం ఏరియా వర్క్‌షాపులో రక్షణ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా సీఎండీ బలరాం ఆదేశాల మేరకు గనుల, డిపార్టుమెంట్లపై అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఉద్యోగి రక్షణను పాటించడం ద్వారా ప్రమాదాలు జరగవని, ప్రమాదరహిత ఉత్పత్తి సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. డిపార్టుమెం ట్లలో అధికారులు విధిగా ఉద్యోగుల విధి నిర్వహణ పరిశీలన చేయడం వారికే మంచిదని తెలిపారు. పనిముట్ల నుంచి మొదలుకొని యంత్రాల వద్ద పనిచేసేటప్పుడు జాగ్రత్తగా పనిచేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, రక్షణాధికారి రవింద్ర, గుర్తింపు సంఘం నాయకులు బీమనాథుని సుదర్శన్ పాల్గొన్నారు.



సీఎంపీఎఫ్‌పై తగ్గుతున్న 'ఇంట్రెస్ట్'

- యేటేటా తగ్గుతున్న వడ్డీ
- ఆందోళన చెందుతున్న కార్మికులు
- సవరణకు పెరుగుతున్న డిమాండ్

శ్రీరాంపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిర్వాకంతో కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతోంది. సీఎంపీఎఫ్‌పై ఇచ్చే వడ్డీని ఏ యేటి కాయేడు తగ్గిస్తూ పోతుండడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనివల్ల అతి తక్కువ పింఛను పొందాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

● తీవ్ర వివక్ష

ప్రతీ ఉద్యోగికి చట్ట ప్రకారం పీఎఫ్ పొందే హక్కు ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు ఉంటాయి. ఇతరులకు ఈపీఎఫ్ ఉండగా, బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) అమలు చేస్తారు. ఇందులో భాగంగా ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతీ కార్మికుడి వేతనం నుంచి 12శాతం మినహాయిస్తారు. యాజమాన్యం కూడా అంతే వాటా కలుపుతుంది. ఈ మొత్తాన్ని సీఎంపీఎఫ్‌లో జమ చేస్తారు. జమయ్యే సొమ్ముపై 7.6 శాతం వడ్డీని ఇవ్వనున్నట్లు ఆ శాఖ కార్యాలయం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది.

ఇంత తక్కువా..?

ఇతర ఉద్యోగులకు ఈపీఎఫ్‌లో భాగంగా సంస్థ వద్ద జమయ్యే మొత్తంపై 8.25శాతం వడ్డీ చెల్లిస్తుండగా, బొగ్గు సంస్థల్లో పనిచేసే కార్మికులకు సీఎంపీఎఫ్‌లో మాత్రం 7.6 శాతం వడ్డీ మాత్రమే ఇస్తున్నారు. ఇది కూడా గత వడ్డీతో పోల్చుకుంటే చాలా తక్కువ.

● నానాటికి కోతలే..

1986లో సీఎంపీఎఫ్‌పై వడ్డీ 10.50శాతం కాగా, ఆ తరువాత వడ్డీరేటు పెరుగుతూ వచ్చింది. 1987లో 11.25శాతం, 1988లో 11.50 శాతం, 1989లో 11.70 శాతం, 1990లో 11.75శాతం, 1991నుంచి 2000 వరకు 12.00శాతంగా అందించారు. ఆ తరువాత నుంచి తగ్గింపు మొదలైంది. 2001లో 11.00 శాతం, 2002లో ఒకేసారి 9.50 శాతానికి పడిపోయింది. 2003లో 9.00 శాతం, 2004లో 8.00శాతం, 2005లో 8.50శాతం, 2006లో 8.00 శాతం, మళ్లీ 2007 నుంచి 2016 వరకు 8.50 శాతం, 2017లో 8.60శాతం, 2018లో 8.50 శాతం, 2019లో 8.60 శాతం, 2020, 2021లో 8.50 శాతం, 2022, 2023లో 8.00శాతం, 2024లో 7.60 శాతం, మళ్లీ ఈ సంవత్సరం(2025) కూడా 7.60 శాతంగా అమలు చేయనున్నట్లు ఇటీవల సీఎంపీఎఫ్ సంస్థ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

● తగిన వడ్డీ ఇవ్వాల్సిందే

సీఎంపీఎఫ్‌పై వడ్డీని నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వ కేబినెట్. అయితే ప్రస్తుతం ఉన్న ధరలు ఆకాశాన్నంటు తున్నాయి. కుటుంబ పోషణకు ప్రతీ ఏడాది ఖర్చులు పెరుగుతున్నాయి. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం సీఎంపీఎఫ్‌పై వడ్డీరేట్లు తగ్గిస్తుండడంతో బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వడ్డీ రేట్ల తగ్గింపుతో తాము రిటైర్ అయిన తరువాత వచ్చే పింఛను చాలా తక్కువగా ఉంటుందని, ఇది కుటుంబ జీవనానికి ఆర్థిక కష్టాలను తెచ్చిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఉద్యోగంలో ఉన్నప్పుడు వేతనాలు అధికంగా చూపిస్తూ ఆదాయపు పన్ను వసూలు చేస్తున్న ప్రభుత్వం పింఛన్ మాత్రం తక్కువ ఇస్తూ దోపిడీకి గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై కార్మిక సంఘాలు ఉద్యమించి, తమకు న్యాయం చేయాలని కార్మికవర్గం కోరుతోంది.

ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోండి

శ్రీరాంపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6 గనిని త్వరలో మూసివేయనున్నందున ఉద్యోగులకు ఇబ్బందులకు కలుగకుండా చూసుకోవాలని ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. గని మూసివేత అనంతరం నిర్వహించే పనులపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగులను ఏరియాలోనే సర్దుబాటు చేయాలన్నారు. యంత్రాలు, యంత్ర సామగ్రి, కంప్యూటర్ సిస్టమ్స్‌ను ఇతర గనులకు చెందిన విభాగాలలోకి పంపించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఇందారం ఓసీపీ ప్రాజెక్ట్ అధికారి ఏవీరెడ్డి, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య, చంద్రలింగం పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

రెబ్బెన, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కైరిగూడ ఓపెన్‌కాస్టు నుంచి బదిలీపై వెళ్తున్న సింగరేణి అధికారి డీవైపీఎం నాగుల వేణును సోమవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మారం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి అధికారి డీవైపీఎం నాగుల వేణు కార్మికులకు, కార్మికుల కుటుంబాలకు, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశారని తెలిపారు. సెటిల్‌మెంటు విషయంలో, మానిటింగ్ బెనిఫిట్స్ విషయంలో త్వరగా చేసినట్టు పేర్కొన్నారు. నిబద్దతతో పనిచేసి కార్మిక వర్గంలో అనతి కాలంలో గుర్తింపు పొందినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీఎస్ వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశైనారావు, జూపాక రాజేష్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

● కైరిగూడ ఓపెన్‌కాస్టులో పది సంవత్సరాల పాటు సంక్షేమ అధికారిగా అత్యున్నత సేవలు అందించి పదోన్నతిపై రామగుండం-1 ఏరియాకు వెళ్తున్న డీవైపీఎం నాగుల వేణుకు సోమవారం కైరిగూడ సింగరేణి సమక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు వెంకటేష్, చంద్రశేఖర్, కిరణ్, మురహరి, రవి, అనీష్, భిక్షపతి పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచుకోని.. చెత్త బండ్లు..



మూలన పడ్డ చెత్తసేకరణ వాహనాలు

- ముస్సిపాలిటీలో తుప్పు పడుతున్న వాహనాలు..
- వార్డులకు సరిపడా లేని కార్మికులు

లక్షెట్టిపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపల్ పాలకవర్గం ముగింపు అయి సుమారు ఏడాది గడుస్తోంది. ఆదాయంలో లక్షెట్టిపేట మున్సిపాలిటీ ముందంజలో ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకడుగులోనే ఉందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో పాలకవర్గం ఉన్న సమయంలో చెత్త వాహనాలు ఉదయమే ఇళ్లముందుకు వచ్చేవి. ప్రజలు కూడా తడి-పొడి చెత్తను వేరువేరుగా చెత్త బుట్టలో జమచేసి వాహనంలో వేసేవారు. కానీ ప్రస్తుతం ఆ సీన్‌లు లేవు. చెత్తవాహనం ఎప్పుడు వస్తుందో అర్థం కాక స్థానిక ప్రజలు సతమతమవుతున్నారు. పలువార్డుల్లో ప్రజలు కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లినాకూడా అక్కడ మున్సిపల్ కమిషనర్ కనిపించక పోవడంతో సిబ్బందికి చెప్పి వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. సిబ్బందితో చెప్పినా కూడా పనులుకాకపోవడంతో చేసేదిలేక మౌనంగా ఉంటున్నారు.

మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్..

లక్షెట్టిపేట మున్సిపాలిటీ గతంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉండేది. 2018ఆగస్టులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసింది. అప్‌గ్రేడ్ అయిన నాటి నుంచి సుమారు నాలుగేళ్ల పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో స్థానిక తహసీల్దార్‌లకు మున్సిపల్ కమిషనర్‌లుగా అదనపు బాధ్యతలు అప్పగించి మున్సిపాలిటీని కొన సాగించింది. 2022జనవరిలో పాలకవర్గం ఏర్పాటు తర్వాత ఇక లక్షెట్టిపేట మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకుపోయారు. మున్సిపాలిటీలో మొత్తం 15వార్డులు ఉండగా ఒక్కో వార్డుకు ఒక్క చెత్త సేకరణ వాహనంతో పాటు సరిపడా కార్మికులను ఏర్పాటు చేశారు. పట్టణం మొత్తం ఎప్ప టికప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్న ఆలోచనలో సుమారు 60 మంది కార్మికులతో పాటు 40మంది రోజూ వారీ కూలీలను ఏర్పాటుచేసి పారిశుధ్య పను లు చేపిస్తూ శభాష్ అనిపించు కున్నారు.

మూలన పడ్డ చెత్త వాహనాలు.. తగ్గిన కార్మికుల సంఖ్య...

లక్షెట్టిపేపేట మున్సిపాలిటీ చెత్త సేకరణకు అప్పటి ప్రభుత్వం వార్డుకు ఒక వాహనం చొప్పున 15 వార్డులకు 15వాహనాలు మంజూరు చేసింది. అంతే కాకుండా డ్రైనేజీలు శుభ్రంచేసి మట్టిని తరలిం చేందుకు రెండు ట్రాక్టర్లను, వేసవికాలం హరిత హారం కోసం రెండు ట్యాంకర్లను కొనుగోలు చేసింది. ప్రస్తుతం 15చెత్త సేకరణ వాహనాలకు కేవలం 9వాహనాలు మాత్రమే పనిచేస్తూ వార్డుల్లో విడతల వారిగా



తుప్పు పడుతున్న ట్రాక్టర్

తిరుగుతున్నాయి. మిగిలిన 6వాహనాలు మాత్రం రిపేర్ రావడంతో అధికారులు వాటిని పట్టించుకోక పోవడంతో అవి తుప్పు పట్టిపోతున్నాయి. ప్రస్తుతం వాటి పరిస్థితి పాత ఇనుప సామాను వారికి ఇవ్వడం తప్ప మరో మార్గం కనిపించడం లేదు. వాహనాల పరిస్థితి ఇలా ఉంటే కార్మికుల సంఖ్య కూడా తగ్గింది. గతంలో 60మంది కార్మికులతో పాటు రోజూ వారి కూలీలు సుమారు 40మంది ఉంటే పదవీకాలం ముగింపు తర్వాత రోజూవారి కూలీలు 41మందితో పాటు ఇద్దరు పర్మ నెంట్ కార్మికులు ఉన్నట్లు అధికారులు చెబున్నారు.

ఇక వాహనాలు మరమ్మతుల గురించి అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. అసలు నడిచే వాహనాలు ఎన్ని, మూలన పడ్డ వాహనాల ఎన్ని అనేది అధికారులు స్పష్టంగా చేప్పలే కపోతున్నారు.

అందుబాటులో ఉండని కమిషనర్..

లక్షెట్టిపేట మన్సిపాలిటీలో విధులు చేపట్టాల్సిన మున్సిపల్ కమిషనర్ ప్రజల సౌకర్యార్థం ఎప్పుడు అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకు కారణం ఈమున్సిపాలిటీలతో పాటు మున్సిపల్ కమిషనర్‌కు పక్క జిల్లాలోని కోరుట్ల మున్సిపాలిటీని కూడా అధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. అక్కడి మున్సిపాలిటీలో పనులు ఎక్కువగా ఉండటంతో ఎక్కువ సమయం అక్కడే కేటాయించాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్న సమాధానం.

వాహనాలు గతంలోనే కాలిపోయాయి..

మారుతీ ప్రసాద్, లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్



సుమారు అయిదు నుంచి ఆరు వాహనాలు గతం లోనే కాలిపోయినట్లు నాకు తెలిసింది. అవి మున్సి పల్ కార్యాలయం వెనకాల ఉన్నాయి. ప్రస్తుతం 9 చెత్త సేకరణ వాహనాలతో పాటు రెండు ట్రాక్టర్లు, ట్యాంకర్ నడుస్తున్నాయి. ఇద్దరు పర్మనెంటు జీపీ కా ర్మికులు ఉండగా రోజూ వారి కూలీలు 41మంది ఉ న్నారు. వాళ్లతో మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు చేపడుతున్నాము.

స్థానిక సమరానికి సై..

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదించినందున అది స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా వర్తిస్తుందా.? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వాలు 42శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేస్తున్నట్లు ప్రకటిస్తే అందుకు పంచాయతీలు, మున్సిపాలిటీల్లోను ఆశావహులు సన్నద్ధం కావాల్సి ఉంటుంది. అయితే బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలనే డిమాండ్ సైతం వినిపిస్తోంది.

జిల్లాలో 306పంచాయతీలు..

మంచిర్యాల జిల్లాలో మున్సిపాలిటీల డీలిమిటేషన్ తర్వాత పంచాయతీల సంఖ్య 306కు పరిమితమైంది. గతంలో 311గ్రామ పంచాయతీలు ఉండగా 5 పంచాయతీలు హాజీపూర్ మండలం, వేంపల్లి, ముల్కల్ల, గుడిపేట, చందరనాపూర్, నర్సింగాపూర్, పంచాయతీలను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసారు. దీంతో పంచాయతీల సంఖ్య 306కు ఫైనల్ అయ్యింది. అలాగే ఆయా పంచాయతీల పరిధిలో 101 క్లస్టర్లుగా విభజించారు. జిల్లాలో మూడు విడతల్లో పం చాయతీ ఎన్నికలను నిర్వహించాలని ప్రతిపాదించిన ప్పటికీ రెండు విడతల్లోనే పూర్తి చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టినట్లు సమాచారం. జిల్లాలో ని 101క్లస్టర్లకు ఒక్కో క్లస్టర్ ఇద్దరు చొప్పున అధికారు లను నియమించి శిక్షణ అందజేశారు.

సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ పరిశీలకుడు రాంభూపాల్ ఆవేశ్

జన్నారం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, టీపీసీసీ పరిశీలకుడు రాంభూపాల్ ఆవేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జ్యోతి గార్డెన్స్‌లో సంస్థాగత నిర్మాణం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి ఏ గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయలేదని, కడెం ప్రాజెక్ట్ గేట్లకు గ్రీస్ పెట్టేందుకు అవసరమైన డబ్బులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ.9.46 కోట్లు మంజూరు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని, ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ముజఫర్ అలీ, ఫసిఉల్లా, మేకల మాణిక్యం, లక్ష్మీనారాయణ, సుభాష్‌రెడ్డి, రాజశేఖర్, తుమ్మల రమేష్, మామిడిపెల్లి ఎల్లయ్య, సయ్యద్ ఇషాక్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూ య(సీతక్క) పేర్కొన్నారు. కలెక్టర్ తో పాటు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. బడి, పుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో అందించేందు కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అధికారుల సమన్వయంతో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నా మన్నారు. ఇందిర మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీఈవో యాదయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి పురషోత్తం, సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పకడ్బందీగా చేపట్టాలి

నూతన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ అందించాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రభుత్వ టీచర్లను బూత్‌స్థాయి అధికారులుగా ఎంపిక చేయాలన్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 25 నుంచి ఎంపికైన బూత్‌స్థాయి అధికారులకు గుర్తింపుకార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి, మంచిర్యాల ఆర్‌డీవోలు హరికృష్ణ, శ్రీని వాసరావులు పాల్గొన్నారు.



మంత్రి వివేక్‌ను కలిసిన క్యాతన్‌పల్లి మాజీ వైస్ చైర్‌పర్సన్, నాయకులు

మంత్రిని కలిసిన క్యాతన్‌పల్లి కాంగ్రెస్ నాయకులు

రామకృష్ణాపూర్, జూన్9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామిని సోమవారం క్యాతన్‌పల్లి మాజీ వైస్ చైర్‌పర్సన్ సాగర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రిగా నియోజకవర్గ ఎమ్మెల్యేగా అభివృద్ధి విషయంలో క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని మరింత ముందుకు తీసుకువె ళ్లాలని నాయకులు కోరినట్లు తెలిపారు. మంత్రిగా రాష్ట్రంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాక చెన్నూర్ నియోజక అభివృద్ధి విషయంలో ప్రతీ ఒక్కరు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపినినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ కౌన్సిలర్ పనాసరాజు, సీనియర్ నాయకులు గోపు రాజం, కట్ల రమేష్, బోద్దుల సాగర్ ఉన్నారు.

గాయపడిన యువకుడికి ఆర్థిక సాయం

నెన్నెల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద యువకుడికి దాతలు అండగా నిలిచారు. చికిత్స కోసం విరాళాలు సేకరించి రూ. 7,500లను సోమవారం అందజేశారు. కన్నెపల్లి మండలం ముత్తాపూర్ గ్రామానికి చెందిన షేక్ అజీజ్ అనే యువకుడు మూడు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాదుకు తరలించి అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. వైద్యం కోసం పెద్ద మొత్తంలో ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకున్న కోవిడ్ వలంటీర్స్ సోపతి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు జలంపల్లి శ్రీనివాస్ సామాజిక మాధ్యమాల ద్వారా విరాళాలు సేకరిం చారు. జమ చేసిన మొత్తాన్ని బాధితుడికి పంపించారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాకారులతో నిర్వాహకులు

మంచిర్యాల క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా స్వరూప ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ శరత్‌బాబు, క్లబ్ కోశాధికారి పురుషోత్తం జాజు, పంతులు, ఆసిఫాబాద్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్ బండ మీనారెడ్డి హాజరై క్రీడాకారులకు బహుమతులు అందించారు. ఆ తరువాత క్రీడాకారుల ఎంపికలు జరిగాయి.

ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి

గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్

దండేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): లంబాడీ ప్రజా ప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు వెంటనే రాజీనామా చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ డిమాండ్ చేసారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న లంబాడి సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు ఇవ్వక పోవడం సిగ్గు చేటన్నారు. లంబాడీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి అదే విధంగా రాష్ట్ర ముఖ్య మంత్రికి లంబాడీలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈసమావేశంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

బెజ్జాల భూకబ్జాపై విచారణ

జైపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బెజ్జాల గ్రామంలో సర్వే నంబరు 352 లోని 20 ఎకరాల భూమి కబ్జాకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వనజ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెవెన్యూ రికార్డులను పరిశీలించిన అనంతరం గ్రామంలో విచారణ చేపట్టారు. కబ్జాకు పాల్పడిన వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కబ్జా చేసిన భూమిని స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కాగా దశాబ్దాలుగా గౌడ కులస్తులు పెంచుకున్న ఈత చెట్లను నరికివేతపై మంచిర్యాల ఎక్సైజ్ మనీషా రాథోడ్ బెజ్జాల గ్రామాన్ని సందర్శించారు.

ఈత చెట్లను నరికివేతకు సంబంధించిన అనుమతులు లేకపోవడంతో వారిపై కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ ఎస్సై పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకు అందివ్వాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్

నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా యువతకు రాజీవ్ యువ వికాస్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ బ్యాంకుల్లో డబ్బు నిల్వ చేసే వారికి మాత్రమే సిబిల్ స్కోర్ ఉంటుందని, ఆర్థిక స్థోమత లేని వారికి సిబిల్ స్కోర్ ఏలా ఉంటుందన్నారు. అంటే డబ్బు ఉన్న వారికే రాజీవ్ యువ వికాస్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నరని, వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వాలని కోరారు. కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే లిస్టులో చేర్చారని ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, పట్టి వెంకట కృష్ణ, దుర్గం స్వామి, ఎనగందుల కృష్ణమూర్తి, సత్రం రమేష్, కాశెట్టి నాగేశ్వర్‌రావు, దీక్షుతులు, బొలిశెట్టి అశ్విన్, సదానందం, కుర్ర చక్రి, తాడూరి మహేశ్, రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న వెంకటేశ్వర్ గౌడ్

ఘనంగా రాష్ట్రోపాధ్యాయ సంఘం వేడుకలు

మంచిర్యాల క్రైం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రోపాధ్యాయ సంఘం 79వ ఆవిర్భావ వేడుకలు జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించిన వేడుకలకు జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిజాం కాలం నాటి నుంచి తాము పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. ప్రశ్నించడం, పోరాడడం తమ విధానం అని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చీపెల్లి బాపు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో కరువు భత్యం, పెండింగ్ వేతన బకాయిలు, పీఆర్‌సీ, ఆరోగ్య కార్డులు, తదితర సమస్యల పరిష్కారికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధాన కార్యదర్శి నివేదికను చదివి వినిపించారు. సంఘం అభివృద్ధికి విశిష్ట సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన శంకర్‌గౌడ్, భీంరావు, కోటేశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్, మాధవిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కార్యదర్శి సుమన్, జిల్లా అసిసోయేటెడ్ అధ్యక్షుడు సత్తయ్య, జిల్లా కార్యదర్శి స్వప్న, దేవి, ఆర్థిక కార్యదర్శి గంగుతాయి, మంచిర్యాల మండల అధ్యక్షుడు మల్లేష్, కార్యవర్గ సభ్యులు విశ్వనాథ్, సతీష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 35 పశువుల పట్టివేత

భీమారం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నుంచి 35 పశువులను లారీలో అక్రమంగా తరలిస్తుం డగా సోమవారం పట్టుకున్నమని భీమారం ఎస్సై శ్వేత తెలిపారు. కలప డిపో దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా వచ్చిన లారీని ఆపి పరిశీలించగా పశువులు కనిపించాయన్నారు. ఇంతలో లారీ డ్రైవర్ రుక్సాఖా పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని విచారించడంతో విషయం తెలిసిందన్నారు. పశువులను మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు తరలిస్తున్నారని డ్రైవర్ చెప్పినట్లు తెలిపారు. పశువులకు సంబంధించిన ఏలాంటి ఆధారాలు లేవన్నారు. అక్రమంగా పశువులను తరలిస్తుందన్నందున డ్రైవర్ రుక్సాఖా, లారీ ఓనర్ పంకజ్ గోపాల్ సింగ్ రాజ్ పుత్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వెటర్నరీ డాక్టర్ రాకేష్ శర్మ పంచనామా చేయగా పశువులను చెన్నూరులోని శివలింగపూర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : సీతారాంపల్లిలో క్షయ వ్యాధి నివారణపై సోమవారం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకంటే ఎక్కువ రోజులు దగ్గు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలని జిల్లా క్షయ నివారణ అధికారి సుధాకర్ నాయక్ అన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నివారణ తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా వైద్యంతో పాటు చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి నెల వెయ్యి రూపాయలు పోషణ భత్యం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వెంకట్, జిల్లా కో-ఆర్డినేటర్ సురేందర్, మాజీ కౌన్సిలర్ సుర్మిళ్ళ వేణు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, హెల్త్ సూపర్ వైజర్ అక్తర్ బేగం, ల్యాబ్ సూపర్ వైజర్ వేణు, టీబీ హెవి స్వప్న, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పునర్నిర్మాణానికి నోచుకోని శనగకుంట మత్తడి

- గత ఏడాది మత్తడిని పేల్చివేసిన రియల్టర్లు
- ఈ వర్షాకాలంలో చెరువులో నీరు నిలిచేనా?

చెన్నూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జాతీయ రహదారి 63 పక్కన ఉన్న శనగకుంట చెరువు మత్తడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. మత్తడిని కొంత మంది రియల్టర్లు పేల్చివేసిన విషయం తెలిసిందే. చెరువు మత్తడిని పేల్చివేసి 9 నెలలు గడుస్తున్నా మత్తడి పునర్నిర్మాణానికి నోచుకోకపోవడంపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో చెరువులో నీరు నిల్వ ఉండకపోతే తమ పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆయకట్టు కింద 60 ఎకరాలు సాగవుతోంది. గత ఖరీఫ్ సీజన్‌లో మత్తడిని పేల్చివేయడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సీజన్‌లో పంట సాగు చేసుకుందామని రైతులు ఎదురు చూస్తుంటే నేటికి మత్తడి పునర్నిర్మాణం చేపట్టకపోవడం అధికారుల అలసత్వానికి అద్దం పడుతుంది. గత సంవత్సరం సెప్టెంబరు 11న పట్టణానికి చెందిన కొంత మంది రియల్టర్లు శనగకుం ట మత్తడిని పేల్చివేశారు. మత్తడి పేల్చివేతతో చెరువులోని నీరంతా వృధాగా పోవడంతో పాటు రైతులు, మత్స్యకారులు తీవ్రంగా న ష్టపోయారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ధ్వంసమైన మత్తడి మరమ్మత్తులకు నోచుకోలేదు. వర్షాకాలం ప్రారంభం అవుతున్నప్పటికీ మత్తడి



ధ్వంసమైన మత్తడి

మరమ్మతులకు నోచు కోకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఈ వర్షాకాలంలోనైనా చెరువులో నీరు నిలిచే అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు, మంత్రి వివేక్ చొరవ చూపి చెరువు మత్తడి పునర్నిర్మాణ పనులను చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతు న్నారు. లేకపోతే ఆయకట్టు రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ డీఈ వేణు గోపాల్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందు బాటులో లేరు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ కలెక్టరేట్‌లో మంచిర్యాల ఆర్‌డీవో శ్రీనివాసరావుతో కలిసి అర్జీలు స్వీకరించారు. అర్హులకు రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. చెన్నూర్ మండలం మోత్కులపల్లి గ్రామానికి చెందిన మద్దూరి అఖిల ఇందిరమ్మ ఇండ్లు పథకంలో ఆర్థిక సహాయం అందించాలని దరఖాస్తు ఇచ్చారు. బెల్లంపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్, ఇంక్లైన్ బస్తీలకు చెందిన ఒక వ్యక్తి అక్రమంగా ప్రభుత్వం తమకు కేటాయించిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. కాసిపేట మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన భూములు ఓసీపీలో పోయాయని, తమకు తగిన నష్టపరిహారం ఇవ్వాలని అర్జీ అందించారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి శివారులో ఉన్న భూమిని వారసత్వంగా సర్వేని అస్మిత వచ్చిందని, ఆ భూమిని ఆక్రమించుకొని తమపై కొందరు వ్యక్తులు దౌర్జన్యం చేస్తున్నారని అర్జీ సమర్పించారు.

సమావేశంలో అధికారుల నిర్లక్ష్యం

ఓ వైపు ప్రజావాణి జరుగుతుండగా, కొందరు జిల్లా అధికారులు నిద్రించగా, మరికొందరు సెల్‌ఫోన్లు చూస్తూ టైం పాస్ చేశారు. ఓ వైపు కలెక్టర్ జిల్లాలోని ప్రజల సమస్యలు వింటూ వారి అర్జీలు స్వీకరించగా, సమస్యల పరిష్కారంలో భాగం కావాల్సిన ఇతర అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

రామగుండం కమిషనరేట్‌లో ఇద్దరు సీఐ బదిలీ

కోల్‌సిటీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషరేట్ ఎస్‌బీలో పని చేస్తున్న పెరుక కరుణాకర్‌ను జగిత్యాల టౌన్ ఎస్‌హెచ్‌వోగా, చెన్నూరు సర్కిల్‌లో పని చేస్తున్న దామెర సుధాకర్‌ను జగిత్యాల రూరల్ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

దండేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలంలోని కస్తూరిబాగాంధీ పాఠశాలలో ఎంఎల్‌టీ, కమర్షియల్ గార్మెంట్స్‌లో బోధించేందుకు అతిథి అధ్యాపకుల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10,11 తేదీల్లో పాఠశాలలో సర్టిఫికెట్లతో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

నియోజకవర్గానికి మహర్దశ



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 9 (ఆంధ్ర జ్యోతి) : చెన్నూరు నియోజక వర్గానికి రానున్నరోజుల్లో మహర్దశ పట్టనుందని, రాష్ట్రమంత్రిగా వివేక్ వెంకటస్వామి నియమితులు కావడం అభివృద్ధికి పెద్ద పీట వేస్తాడని పాత బస్టాండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సదా నందం తెలిపారు. సోమవారం మంత్రిగా వివేక్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమంతో పాటు రాష్ట్ర ప్రగతికి పనిచేస్తారని, అధిష్ఠానం మంత్రి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో బడిబాట

దండేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నపేట, సోమగూడ గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బ డిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వాడల్లో తిరుగుతూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై విద్యార్థులకు, విద్యార్థుల తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పాల మనోహర్, సంగర్స్ రాజేశ్వర్‌రావు, మల్లేశం, శ్రీనివాస్, గంగన్న, దీపిక పాల్గొన్నారు.

స్థానిక సమరానికి సై..



పంచాయితీలు, వార్డుల వివరాలు... జిల్లాలో

- పంచాయతీలు -306
- వార్డులు -2,680
- ఓటర్లు - 3,76,853
- పోలింగ్ కేంద్రాలు -2,680
- బ్యాలెట్ బాక్సులు -3,777

- సన్నద్ధమవుతున్న ప్రభుత్వం
- రాజకీయ పార్టీల సమాయత్తం
- బీసీ రిజర్వేషన్లపై స్పష్టత కరువు

మంచిర్యాల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కాగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సైతం సమాయత్తం అవుతున్నాయి. ఇటీవల మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి చేసిన ప్రభుత్వం దాన్ని అధికారికంగా ప్రకటించేందుకు నిర్ణయించింది. మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ దాదాపుగా పూర్తి కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికే పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం దాదాపుగా పూర్తి చేసింది. ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలు పూర్తి కాగా బ్యాలెట్ బాక్సులు తదితర సామగ్రి కూడా జిల్లాలకు చేరుకుంది. ఈ క్రమంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతుందని వినిపిస్తోంది. అయితే మున్సిపల్ ఎన్నికలు జరిగిన తర్వాతే పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తారని కూడా మరో వైపు చర్చలు జోరందుకున్నాయి. మొత్తంగా ఆ ప్రక్రియలను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కూడా సిద్ధంగా ఉంది.

బీసీ రిజర్వేషన్లపై కానరాని స్పష్టత...

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు సిద్ధపడుతుండటంతో బీసీ రిజర్వేషన్ల సంగతి ఏంటని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టిన రేవంత్ సర్కార్ కేంద్ర ప్రభుత్వం ఆమోదం కోసం ప్రతిపాదనలను పంపింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. అయితే ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్లను బీసీలకు..

- మిగతా7లో

మరమ్మతులకు నోచుకోని.. చెత్త బండ్లు..

- మున్సిపాలిటీ లో తుప్పుపడుతున్న వాహనాలు..
- వార్డులకు సరిపడా లేని కార్మికులు

7

ఎరువుల కొరత.. రైతన్న వెత

- పదిహేను రోజులుగా దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు

6

సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



తోళ్లవాగు వంతెనను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు. సమీకృత మార్కెట్, వినూత్న కాలనీలో వంతెనను సోమవారం మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు అన్ని రకాల నిత్యావసర సరకులు చేరువలోకి తీసుకురావాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత మార్కెట్‌కు నిధులు విడుదల చేసి నిర్మాణం చేపట్టిందన్నారు. పనులు చివరి దశకు చేరాయన్నారు. మిగులు పనుల పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయలే దన్నారు. వెంటనే సమీకృత మార్కెట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వినూత్న కాలనీకి వెళ్లే మార్గంలో తోళ్లవాగుపై వంతెన నిర్మాణానికి రూ. 80 లక్షలు మంజూరు చేస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పనులను రద్దు చేయించారన్నారు. అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే పనులను రద్దు చేయించారని ఆరోపించారు. వెంటనే వంతెన పనులను తిరిగి ప్రారంభించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్ రావు, ఈసంపల్లి ప్రభాకర్, సుబ్బయ్య, పవన్ కుమార్, రవి గౌడ్, మేడం తిరుపతి, వంగ తిరుపతి, కాటం రాజు, సంపత్ కుమార్, పాల్గొన్నారు.

కరాటే విజేతలను అభినందించిన సీఐ



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సీఐ శశీధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల విజేతలను సోమవారం మందమర్రి సీఐ శశీధర్‌రెడ్డి అభినందించారు. జూన్ 1న హైదరాబాద్, యూసఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఓపెన్ కరాటే పోటీల్లో భాగంగా అత్యంత ప్రతిభ కనబరచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు మాస్టర్ జూల శ్రీనివాస్ తెలిపారు. రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో నిర్వహించిన వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులే ఈ బహుమతులను సాధించడం గొప్పవిషయం అని అదేవిధంగా మొబైల్ ఫోన్, టీవీ, సోషల్ మీడియా లాంటి వాటికి దూరంగా ఉండి సమయాన్ని వెచ్చించి కరాటే లాంటి శిక్షణ తీసుకోవడమే కాక విజయం సాధించడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని సీఐ అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

సీపీఐ మహాసభను విజయవంతం చేయండి

- 15న చాడ వెంకట్ రెడ్డి రాక

నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నస్పూర్ మండల మూడవ మహా సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మహా సభ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు మేకల దాసు కోరారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండల సభ ఈ నెల 15న ఆదివారం స్థానిక నర్సయ్య భవన్‌లో జరుగుతుందని, ఈ మహా సభకు ముఖ్య అతిథిగా జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డితో పాటు పలువురు హాజరు కానున్నారన్నారు. 21,22 తేదీల్లో మంచిర్యాల జిల్లా మహా సభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ సింగరేణి ఏర్పడిన నాటి నుంచి కార్మికుల పక్షాన నిలిచి అనేక పోరాటాలు చేసిన ఘనత సీపీఐకి దక్కిందన్నారు. కార్మిక కాలనీల్లో అనేక మౌలిక సదుపాయాలను సాధనలో పార్టీ పాత్ర కీలకమన్నారు. గ్రామ పంచాయతీల నుంచి నేటి మున్సిపల్ కార్పొ రేషన్ వరకు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి కృషి చేస్తున్నా మన్నారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి లింగం రవి, నాయకులు మిర్యాల రాజేశ్వర్‌రావు, రామన్న, శంకర్, లచ్చిరెడ్డి, లచ్చన్న, రాకేష్ పాల్గొన్నారు.

బాల కార్మికుల వ్యవస్థను నియంత్రించాలి

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్



భవన నిర్మాణ కూలీలతో మాట్లాడుతున్న రౌఫ్‌ఖాన్

నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థను సమిష్టిగా నివారించాల్సిన అవసరం ఉందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ అన్నా రు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని నస్పూర్ పట్ట ణంలోని కలెక్టరేట్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్‌లకు సోమవారం అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయించవద్దన్నారు. ఒక్క వేళ పని చేయిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. బాల కార్మికులు పని చేసినట్లు కనిపిస్తే వెంటనే 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎల్‌ఓ రామ్మో హన్, డీసీపీఓ ఆనంద్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్స్ పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన మంత్రి వివేక్ దంపతులు



మల్లిఖార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి దంపతులు

మందమర్రిటౌన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను సోమవారం రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కలిసి శాలువాతో సత్కరించారు. స్వీట్లు తినిపించారు. ఆయనతో పాటు ఆయన తనయుడు, ఎంపీ గడ్డం వంశీకృష్ణ కూడా ఉన్నారు. అదే విధంగా అక్కడ నుంచి నేరుగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ను కూడా ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భూ భారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం



తాళ్ళపేటలో రైతుల నుంచి భూ సమస్యపై దరఖాస్తు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

దండేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. సోమవారం మండలంలోని ధర్మరావుపేట. తాళ్లపేటలోని రెవెన్యూ సదస్సు ద్వారా భూ సమస్య పరిష్కరం కోసం రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రైతులకు భూ హక్కులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూభారతి చట్టం, సాదా బైనామా, పీవోటీ, భూ విస్తీర్ణంలో మార్పులు తదితర అంశా లపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీ ల్దార్ విజయ, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్ఐ బొద్దుల భూమన్న, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి నేనే రాజు.. నేనే మంత్రి

- అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా..
- ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



ప్రభుత్వ ఆసుపత్రి భవనం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

లక్షెట్టిపేట, జూన్ 9(ఆంధ్రజ్యోతి): 'మంచిర్యాల నియోజకవర్గానికి నేనే రాజు.. నేనే మంత్రి'ని అని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనంతోపాటు ప్రభుత్వ కళాశాల, పాఠశాల నిర్మాణం పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి పదవి రాలేదని బాధపడేది లేదన్నారు. జిల్లాలో ఎవరికి మంత్రి పదవి వచ్చిన నా మంచిర్యాల నియోజకవర్గంలో తనదే చివరి నిర్ణయమన్నారు. తనకు బాస్ జిల్లాలో మంత్రులు కాదని, సీఎం రేవంత్‌రెడ్డే తన బాస్ అన్నారు. 25 ఏళ్ల నుంచి పార్టీ కోసం పార్టీ అభివృద్ధి కోసం నేను కష్టపడ్డ విషయం అందిరికీ తెలుసన్నారు. తనకు పార్టీ అభివృద్ధే ముఖ్యం అన్న విషయం అధిష్ఠానానికి కూడా తెలుసన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో పార్టీ అంటే ఎంటో ఇంద్రవెల్లి సభతో చూపించిన సంగతి ప్రతీ ఒక్కరికి తెలుసన్నారు. మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో కాం గ్రెస్ పార్టీ జెండా కనపడకుండా అప్పటి నాయకులు చేసినా కూడా భయపడకుండా తన వెన్నంటే ఉన్న కార్యకర్తలతో కలిసి ఇంద్రవెల్లి సభ సమయంలో ప్రతీ ఇంటిపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా చేసానన్నారు. తనకు పదవులు, డబ్బు ముఖ్యం కాదని, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ మాత్రమే ముఖ్యమన్నారు. రానున్న రోజుల్లో మంత్రి పదవికంటే పెద్ద పదవి తనకు వచ్చే సందర్భం కూడా ఉందన్నారు. పట్టణంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న భవనాలు ఈనెల 12న అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటి చైర్మన్ ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మాజీ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జిల్లా నాయకులు గడ్డం త్రిమూర్తి, పూర్ణచందర్‌రావు, చింత అశోక్ ఉన్నారు.

మోదీ 11 ఏళ్ల పాలనపై సంబరాలు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్


నస్పూర్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : భారతీ య జనతా పార్టీ మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాలనపై ఈ నెల 11నుంచి 21 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నా మని పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంక టేశ్వర్ గౌడ్ తెలిపారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నరేంద్ర మోదీ చేసి న అభివృద్ధి పథకాలు, సాధించిన ఆర్థిక ప్ర గతి ఫలాలను ప్రజలకు వివరించాలన్నారు.

గ్రామగ్రామాన మోదీ ప్రభు త్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేప్పాల న్నారు. పర్యావరణ పరిరక్షణకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు వారీ కుటుంబ సభ్యుల సంఖ్య ప్రకారం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాల న్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 15 వరకు దాదాపు 40 రోజుల పాటు మొక్కలు నాటే కార్యక్రమం చేయాలన్నారు. ఈ నెల 23న శ్యామ్ ప్ర సాద్ ముఖర్జీ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషో త్తం, పట్టి వెంకటకృష్ణ, ఎనగందుల క్రిష్ణమూర్తి, దుర్గం స్వామి, సదా నందం, అశోక్ వర్ధన్, రాజు, సమ్రాజ్ రమేష్, సత్రం రమేష్, కాశెట్టి నాగేశ్వర్ రావు, అశ్విన్, ఈర్ల సదానందం, కుర్ర చక్రి, మహేష్, మం త్రి రమన్న పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ డివిజన్ కమిటీ ఎన్నిక

బీజేపీ మంచిర్యాల కార్పొరేషన్ జోనల్ శ్రీరాంపూర్ నూతన కమిటీని సోమవారం జి ల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ ప్రకటించారు. కార్పొరేషన్ మూడు మండలాలతో కలిపి ఏర్పడగా తమ పార్టీ నాలుగు జోన్లుగా విభజించి కమిటీలను నియమిస్తున్నట్లు తెలి పారు. ఇందులో భాగంగా శ్రీరాంపూర్ అధ్యక్షుడుగా సత్రం రమేష్, ప్రధాన కార్యదర్శు లుగా పోన్నవేని సదయ్య, బద్రి శ్రీకాంత్, ఉపధ్యాక్షులుగా కట్కూరి తిరుపతి, రాజకొండ సత్యనారాయణ, జయమ్మ, కార్యదర్శులుగా సుప్రజ, మాకోటి మల్లేష్, కర్ర ప్రదీప్, కొంతం మహేందర్, కోశాధికారిగా రాజేందర్‌లతో పాటు 35మంది సభ్యులను నియమించినట్లు తెలిపారు.

చేప మందు కోసం వెల్లువెత్తిన జనం



దండేపల్లిలో చేప మందు ప్రసాదం నోట్లో వేస్తున్న నిర్వాహకులు భూలక్ష్మి ప్రేమ్‌రాజ్

- వర్షంలోనూ పంపిణీ..విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన వ్యాధిగ్రస్తులు

దండేపల్లి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మృగశిరకార్తే(మిరుగు) ప్రవేశాన్ని పురస్కరించుకొని అస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు దండేపల్లిలోని స్థాని క ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత చేపమందు కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఉదయం 7 గం టలకు దండేపల్లికి చెందిన రంగసాయి ప్రేంరాజ్, భూలక్ష్మిల దంపతులచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుప తి, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు, స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ సమక్షంలో చేపల మందు వేశారు. వర్షంలో సైతం జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోగులు తమ వెంట చేప పిల్లలను తెచ్చుకోగా నిర్వాహకులు మందు, చేప పిల్ల ద్వారా అస్తమా రోగులకు నో ట్లోకి వదులుతూ చేప మందు అందజేశారు.

దండేపల్లిలో ఉచిత చేప మందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో ముందు రోజుదూర ప్రాంత్రల నుంచి వందలాది మంది వ్యాధిగ్రస్తులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాట్లు చేశారు. ఈ చేప మందు కార్యక్రమానికి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, మహారాష్ట్ర నుంచి సిరివంచ, ఛత్తీస్‌గఢ్, కర్ణాటకల నుంచి వేలాది మందికి పైగా తరలివచ్చి చేప మందును స్వీకరిచారు. నిర్వహణ కమిటీ సభ్యులతో పాటు దండేపల్లికి చెందిన పలువురు వలంటిర్లు సేవలందించారు. ఎస్సై ఎండి తహసీనోద్దీన్ ఆధ్వ ర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉద యం ప్రారంభమైన చేపల మందు కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. ఒక్కో చేప పిల్లలకు కేవలం రూ. 20 నుంచి 50 వరకు విక్రయించారు. దీంతో వ్యాపారులకు మంచి గిరాకి లభించింది.



దండేపల్లి ఉచిత చేప మందు కేంద్రం బారులు తీరిన వ్యాధిగ్రస్తులు